

ఆసుపత్రి వద్ద మృతుని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - పెద్దాపురం

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుని బంధువులు ఆందోళనకు దిగారు. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో గురువారం చెట్టుకొమ్మలు నరుకుతుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన దూళ్ల సుబ్రమణ్యం మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా గురువారం మృతుని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. పేదవాడైన సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు

టీచర్ ఎంఎల్‌సి పోలింగ్‌కు ఓటెత్తారు

92.62 శాతం నమోదు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. రికార్డు స్థాయిలో 92.62 శాతం నమోదైంది. 116 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా ఎటువంటి సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ పోలింగ్ కోసం కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. బ్యాలెట్ బాక్సులను కాకినాడ జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ క్రమంగా పుంజుకుంది. మధ్యాహ్నం రెండు గంటలకే 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి 92 శాతానికిపైగా ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 95.21 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 88.70 శాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లో 91 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. మొత్తం 16,737 మంది ఓటర్లకు 15,502 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు.


రాజమహేంద్రవరం తహశీల్దార్ కార్యాలయంలో బారులు తీరిన ఓటర్లు


ఓటు వేసిన మహిళా ఉపాధ్యాయులు


స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తూ...

విజయం తథ్యం : గోపిమూర్తి

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల, ప్రజా సంఘాల మద్దతుతో పోటీలో నిలిచిన తనకు విజయం తథ్యమని పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి దీమా వ్యక్తం చేశారు. కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో నాయకులు, ప్రజా సంఘాలనేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైందని, తప్పకుండా విజయం సాధిస్తానని నమ్మకం వ్యక్తం చేశారు. తాను గెలిస్తే పిడిఎఫ్ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై మండలిలో గళం విప్పుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్, ప్రధాన కార్యదర్శి టి.చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి పి.ఆనంద్, సీనియర్ యుటిఎఫ్ నాయకులు సత్తిరాజు, వర్మ, ప్రజాసంఘాల నాయకులు, లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ కాకినాడలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జిల్లాల వారీగా పోలింగ్ ఇలా...

జిల్లా పేరు	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
ఎఎస్ఆర్ జిల్లా	637	565	88.70
తూర్పు గోదావరి	2990	2753	92.07
ఏలూరు	2667	2444	91.64
కాకినాడ	3418	3118	91.22
అంబేద్కర్ కోనసీమ	3296	3138	95.21
పశ్చిమ గోదావరి	3729	3484	93.43

విద్యుత్ బిల్లుల షాక్

వినియోగదారులపై ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల బాదుడు
ఏడాదికి రూ.336 కోట్ల వరకూ భారం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పి.నాగమణికి గత నెలలో రూ.1,200 వరకు బిల్లు వచ్చింది. ఈ నెల ఏకంగా రూ.2,459 బిల్లు రావడంతో అవాక్కైంది. ఏంటి అని ఆరా తీయగా... సర్దుబాటు ఛార్జీలు అదనంగా రూ.1,100 కట్టాల్సి వస్తుందని తెలుసుకుంది. ఇప్పటికే కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని ఆందోళన చెందుతున్న ఆమె.. ఈ నెల బిల్లు చూసి గగ్గోలు పెడుతుంది. ఈ సర్దుబాటు ఒక్క నాగమణికి మాత్రమే పరిమితం కాలేదు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులందరికీ సర్దు'పోటు' వర్తిస్తుంది. ఇప్పటికే ధరలతో సతమతమవుతూ అర్ధాకలితో జీవనం సాగిస్తున్న సామాన్యులు పెరిగిన విద్యుత్ ధరలతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గతంలో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్ ఛార్జీల పేరుతో చేస్తున్న వసూలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. రాబోయే నాలుగేళ్ల పాటు ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విద్యుత్ ఉత్పాదన వ్యయం, కొనుగోలు ధర వ్యత్యాసాన్ని గతంలో ట్రూఅప్ పేరుతో ఏడాదికి ఒకసారి లెక్కించి వసూలు చేసేవారు. కొత్త నిబంధన ప్రకారం ఇకపై ఏ నెలకు ఆ నెల విద్యుత్ బిల్లుతో కలిపి వసూలు చేస్తున్నారు. ట్రూ అప్ ఛార్జీ కింద గతంలో వాడుకున్న కరెంటుకు యూనిట్‌కు రూ.20పైసలు నుంచి 80 పైసలు వరకు వసూలు జరుగుతోంది. తాజాగా డిసెంబరు నుంచి ప్రతి నెల కరెంటు బిల్లులో కలిపి రాబట్టుకున్నారు. దీని వలన ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులపై ఏడాదికి రూ.336కోట్లకు పైగా భారం పడనుంది.

జిల్లాలో రోజుకు 20 మిలియన్ యూనిట్ల వినియోగం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 19.16లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 16.23 లక్షల గృహ కనెక్షన్లు ఉన్నాయి. మిగతావి వాణిజ్య, పరిశ్రమలు, తాగునీటి కనెక్షన్లు, వీధిలైట్లు తదితర కనెక్షన్లు 3.07 లక్షలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజువారీగా 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అందులో 8 మిలియన్ యూనిట్ల వరకూ గృహ అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.400 కోట్లు డిమాండ్ నోటీసులు (కరెంటు బిల్లులు) జారీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 80 లక్షల యూనిట్ల విద్యుత్‌ను నిత్యం వాడుతున్నారు. ట్రూ అప్ ఛార్జీలు యూనిట్‌కు 20పైసల లెక్కన వసూలు చేస్తే రోజుకు రూ.16 లక్షల చొప్పున నెలకు సుమారు రూ.4.80 కోట్ల వరకూ భారం ఉంటుంది. యూనిట్‌కు 0.60 పైసలు చొప్పున లెక్కిస్తే రోజుకు రూ.60 లక్షల చొప్పున నెలకు రూ.12 కోట్ల మేర గృహ వినియోగదారులు చెల్లించాల్సి వస్తుంది. సరాసరిన రూ.28కోట్ల మేర భారం పడుతోంది. ఒక వినియోగదారుడు నెలకు 300 యూనిట్లు విద్యుత్ వాడితే ట్రూ అప్ చార్జీల కింద యూనిట్‌కు 80 పైసలు చొప్పున రూ.240 అదనంగా చెల్లించాల్సి వస్తోంది..


Reading Mode : IR
DT:04-12-2024 Time :09:12 am
BNo 51272074449S GRP:M1
ERO RAJAHMUNDRY TOWN
SEC RAJAMAHENDRAVARAM-D2
DIST EAST GODAVARI
UNQ SC 20744495
SCNO 1432022204007877
NAME PILLANAGAMAN..
ADDR ARYAPURAM
CAT :1 PH :1
SCAT : LT Domestic Domestic
CONTRACTED LOAD 0.32KW
CONNECTED LOAD 0.32KW
MNo 4356242 MF:1.0
READING MONTH STS
PRES KWH 14525 04-12-2024 1
PREV KWH 14293 03-11-2024 1
AVG UNITS 201
BILLED UNITS 232
RMD 1.3KVA
ENERGY CHRG 1239.90
FIXED CHRG 10.00
CUST CHRG 55.00
ED 13.92
SURCHARGES 25.00
ED INT 0.19
TRUEUP CHRG 0.00
FPPCA CHRG 106.36
FPPCA2 CHRG 71.00
SHORTFALL 0.00
ACD SURCHRG 0.00
FAN INSTAL 0.00
ADJ AMOUNT 0.00
LOSS/GAIN -0.37
BILL AMOUNT 1521.00
GOVT SUBSIDY 162.00
BILL AFT SUB 1359.00
ISD-TDS : 0.00
ARREARS
BEF 01/04/24 0.00
AFT 01/04/24 1100.71
NET BILL 2459.71
DUE DATE 18-12-2024
DISC DATE 03-01-2025

మారని విధానాలు

తాము అధికారంలోకొస్తే విద్యుత్ బిల్లులు పెంచబోమని వీలైతే తగ్గించేందుకు ప్రయత్నిస్తామని సాక్షాత్తూ టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు అనేక సభల్లో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ట్రూ అప్ విద్యుత్ ఛార్జీల వడ్డనకు తెరతీశారు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే ఇంధన ధరలు, కొనుగోలు చేసే విద్యుత్ ధరల వ్యత్యాసాన్ని లెక్కించి ఆ లోటను భర్తీ చేసేందుకు ట్రూ అప్ చార్జీలు వసూలు చేసే తాజా నిర్ణయంతో ప్రభుత్వం ప్రజలకు మరోసారి షాక్ ఇచ్చింది.

20వ రోజుకు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మూసివేసిన ఫ్యాక్టరీని తెరిపించి తమకు ఉపాధి కల్పించాలని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరి కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ ధర్నా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత నెల 16వ తేదీన జీడిపిక్కలు ఫ్యాక్టరీ యాజమాన్యం అర్థాంతరంగా ఫ్యాక్టరీ మూసివేసి కార్మికుల పొట్టను కొట్టిందన్నారు. గత 20 రోజులుగా కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్న యాజమాన్యానికి కానీ, ప్రభుత్వానికి గాని చీమకుట్టినట్టు లేదన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పిస్తామని హామీలు గుప్పించిందన్నారు. ఉన్న ఫ్యాక్టరీలు మూతపడి ఉపాధి లేక కార్మికులు రోడ్డున పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, కె.చక్రధర్, సిహెచ్.గోవిందు, ధర్మాజీ, ఎస్.జయలక్ష్మి, అన్నపూర్ణ, నాగలక్ష్మి, జి.వరలక్ష్మి, శివలక్ష్మి, టి.దేవి, మహిళ కార్మికులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాజ్‌కుమార్

ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - కాజులూరు

నిబంధనలు సడలించి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కాజులూరు, శీలలంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుపాన్ ప్రభావంతో తడిసిపోయిన ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కౌలు రైతు నామా చంద్రరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యంలో తేమ శాతం 16, 17 ఉంటుందని, అయితే మిల్లుల వద్ద 20 నుంచి 22 శాతం తేమ శాతం చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ తేమ శాతం 20 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులు చెబుతున్నారని, ఆచరణలో తేమ శాతం 16 ఉండాలని, అలాగైతేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని అన్నారు. అంతకన్నా ఎక్కువ వస్తే ఒక పాయింట్‌కి ఒక కేజీ కట్ చేస్తున్నారని, దీనివల్ల రైతులు రూ.200 నుంచి రూ.300 వరకూ కోల్పోతున్నారని అన్నారు. పూర్తిగా ఆరుదల ఉన్నప్పటికీ రూ.1630 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం రైతులకు వేస్తానన్న అన్నదాత సుఖీభవ రూ.20 వేలను వెంటనే వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నామ తాతారావు, ఇయాల ముసలయ్య, చెరువు కొండ, నామా వెంకటేశ్వర్లు, నామా ఆంజనేయులు, నామా రాంబాబు పాల్గొన్నారు.


రైతులతో కలిసి ధాన్యాన్ని చూపుతున్న వల్లు రాజబాబు

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండల పరిధిలో నిర్వహించనున్న షష్టి ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై అడిషనల్ ఎస్‌పి ఎంజెవి. భాస్కరరావు సమీక్షించారు. గురువారం తాడిపత్రి, ఎపి. మల్లవరం గ్రామాలలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాలను ఆయన సందర్శించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సిఐ జి.శ్రీనివాస్ ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్‌పి

వినియోగదారుల చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అన్నారు. గురువారం స్థానిక ట్రినిటీ పబ్లిక్ స్కూల్లో వినియోగదారుల చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మండలం వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం.భాస్కరరావు, ఎం.లక్ష్మి, కె.మల్లేశ్వరరావు, మల్లీశ్వరి, పి.దుర్గాప్రసాద్, ఎంఎం.మాధురి, శ్రీదేవి, శ్యామల పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సూర్యనారాయణ

పాలిటెక్ ఫెస్ట్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు పాలిటెక్ ఫెస్ట్-24లో ఉత్తమ ప్రతిభను చాటుకున్నారని ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్. కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 3, 4 తేదీల్లో కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్‌లో జరిగిన సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్ - 2024లో ఆదిత్య విద్యార్థులు కె.విజయ్, పి.శ్రీ పురంధేశ్వరి, ఎం.సోనినవీన, ఎ.శ్రావణి లావణ్య ప్రదర్శించిన చేతి సంజ్ఞల ద్వారా నియంత్రించబడే దివ్యాంగుల చక్రాల కుర్చీ ప్రాజెక్ట్‌కు ద్వితీయ బహుమతితో పాటు రూ.10 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారని అన్నారు. మెకానికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ విభాగాలలో ప్రదర్శించిన ప్రాజెక్టులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రదర్శనకు ఎంపిక అయ్యాయని తెలిపారు. విజేతలను అభినందించారు. ఈ సమావేశంలో డీన్ ఎవి.మాధవరావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఆర్.శ్రీనివాస్ ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మెగా పేరెంట్స్ మీట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 7వ తేదీన జిల్లావ్యాప్తంగా జరుగుతున్న మెగా పేరెంట్స్-టీచర్స్ సదస్సులను జయప్రదం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి కోరారు. గురువారం మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై అమరావతి నుంచి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కమిషనర్ కోనా శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి విద్యాశాఖ అధికారి పి.రమేష్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనలో నాణ్యతను పెంచడంతో పాటు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 933 ప్రైమరీ పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ 94, హైస్కూలు 253 మొత్తం 1,280 పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించడానికి ఇప్పటికే పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులందరికీ ఆహ్వాన పత్రికలు పంపించడం జరిగిందన్నారు. ఈ సమావేశాలు సక్రమంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. తల్లిదండ్రులు సూచించిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో అవసరమైన విధి విధానాలు రూపకల్పనకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. తమ పిల్లల సమగ్ర వివరాలతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా జిల్లాలో 35 పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య సమాచారంతో కూడిన కార్డులు కూడా పంపిణీ చేయనున్నామని చెప్పారు.




ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత నిస్తూ వారి రక్షణ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తెలిపారు. గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ సెంటర్ వద్ద ప్రత్యేక నిఘా యూనిట్లను ఏర్పాటు చేశారు. సిసి కెమెరా యూనిట్లను పట్టణ పరిధిలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు రద్దీ ప్రదేశాల్లో దొంగతనాలు, నేరాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందన్నారు.


సిసి కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

కార్టూ'నిజం'



కాకినాడలో వేగ షోరూమ్ ప్రారంభం

హాజరైన సినీనటులు బాలకృష్ణ, సంయుక్త మీనన్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ బాలాజీ చెరువు సమీపంలో వేగ జ్యూయలర్స్ నూతన షోరూమ్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. వేగ జ్యూయలర్స్ బ్రాండ్ అంబాసిడర్ సినీనటుడు నందమూరి బాలకృష్ణ హిరోయిన్ సంయుక్త మీనన్‌తో కలిసి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. కుమర్తె పుట్టిన రోజు సందర్భంగా బంగారం కొంటే ఆమె వయస్సుతో పాటూ బంగారం విలువ పెరుగుతూ వస్తుందన్నారు. బంగారం అంటే ఖర్చు మాత్రమే కాదని అది భవిష్యత్తు తరాలకు సంపద అన్నారు. హిరోయిన్ సంయుక్త మీనన్ మాట్లాడుతూ.. ఈ షోరూమ్‌లో ఒక మోడల్ చూపించమంటే వందల రకాలు చూపిస్తున్నారన్నారు. వేగ యాజమాన్యం వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు తాము నాణ్యమైన బంగారు ఆభరణాలను అందిస్తున్నామన్నారు. వారి విశ్వాసాన్ని చూరగొన్నామన్నారు. కాకినాడలో షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నూతన షోరూమ్ ప్రారంభోత్సం సందర్భంగా గురువారం నుంచి డిసెంబర్ 12 వరకూ ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ప్రతి ఆభరణంపై విఎ 4.99 శాతం నుంచి 11.99 శాతం వరకూ ఉంటుందన్నారు. బిఐఎస్ హాల్ మార్కు బంగారు ఆభరణాలు, సర్టిఫికెట్‌తో డైమండ్స్ క్యారట్ ధర రూ.50,999 మాత్రమే అని తెలిపారు. ఈ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ షోరూమ్‌లో సంప్రదాయ ఆభరణాల నుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకూ ముక్కు పుడక నుంచి ముత్యాల హారాల వరకూ అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. వధువు ధరించే ఆభరణాల నుంచి రోజూ ధరించే ఫ్యాన్సీ ఆభరణాల వరకూ వేగలో దొరుకుతాయన్నారు.



ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న సినీనటుడు బాలకృష్ణ

నేల సారాన్ని సంరక్షించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

భవిష్యత్ తరాల మనుగడకు ఆరోగ్య వంతమైన నేలను అందించేందుకు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ ఎఫ్‌టిసి డిడి ఎబివిఎస్‌సి .హరి అన్నారు. గురువారం మండ లంలోని కట్టమూరు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ అధ్యక్షతన ప్రపంచ నేలల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన నేలను సంరక్షించడం ద్వారానే భవిష్యత్తు తరాల మనుగడ సాధ్యమన్నారు. నేల ఆరోగ్యాన్ని పరిరక్షించాలంటే రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ మందుల వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసి ఎఒ బదవులూరి సంజీవ్, ఎఇఒ బి.రాగస్రవంతి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు అమృత వర్షిని, విజయదుర్గ, రైతులు కాకర్ల సూరిబాబు, బొడ్డు బాబూరావు, మేడిది శ్రీనివాస్, పబ్బు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఏలేశ్వరంలో జరిగిన ర్యాలీలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.జ్యోతి మాట్లాడారు. సారవంతమైన నేల లేకపోతే పంటల పండక, చెట్లు పెరగక మానవ మనుగడే ప్రశ్నార్ధకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొదటి సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల మొదటి సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. గురువారం కళాశాలలో తొలి సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్‌ను అకడమిక్ డైరెక్టర్ నాయుడు, పరీక్షల నియంత్రణాధికారి సిహెచ్‌వివి .సత్యనారాయణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ లోగా సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించాలని అన్నారు. ఎగ్జామినేషన్ పోర్టల్ ద్వారా అప్లికేషన్ పూర్తి చేయాలని, పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించుకునే అవకాశం కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకులకు మరమ్మతులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మెయిన్ రోడ్డులో ప్రజాసంఘాల భవనం, విశ్రాంత ఉద్యోగుల భవనానికి వెళ్లే రహదారిలో పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. పైపులైన్‌కు రంధ్రం పడి తాగునీరు రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పంచాయితీ కార్యదర్శి నున్న శంకర నారాయణ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్ గురువారం పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టారు.

ప్రశాంతంగా టీచర్స్ ఎంఎల్‌సి పోలింగ్

జిల్లాలో టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎన్నికల యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ అనంతరం ఓటింగ్ బాక్కులను జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. జిల్లాలో22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 3,418 మంది ఓటర్లు ఉండగా 3,118 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 91.22 శాతం పోలింగ్ జరిగిందని జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం మండలంలో 200 ఓటర్లకు గాను 184 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నారు. 92శాతం పోలింగ్ నమోదు అయ్యినట్టు ఎన్నికల అధికారిణి పి సంధ్య తెలిపారు. పోలింగ్ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, డిఎస్‌పి రఘువీర్‌విష్ణు పరిశీలించారు. ఓటింగ్ సరళని సిఐటియు రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషాబాబ్జి పరిశీలించారు. **గొల్లప్రోలు** మండలంలో 65 మంది ఓటర్లు ఉండగా ఓటింగ్ ముగిసే సమయానికి 62 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పోలింగ్ బూత్ ఎపిఒ నవీన్‌చంద్ర తెలిపారు. ఓటింగ్ సరళిని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు వి.సత్యనారాయణరెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సూరిబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఎంవి.సత్యనారాయణ పరిశీలించారు. **కాజులూరు** మండలంలో 95 శాతం పోలింగ్ నమోదు అయిందని తహశీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. 71 మంది ఓటు హక్కును వినియోగించికోవలసి ఉండగా 67 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. గొల్లపల్లి ఎస్ఐ మోహన్‌కుమార్ బందొబస్తు ఏర్పాటు చేశారు. **ఏలేశ్వరం** మండలంలో 101 మంది ఓటర్లు ఉండగా 97 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి ఎం.మేరీ తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. **సామర్లకోట** మండల పరిధిలోని 178 ఓట్లకు 162 ఓట్లు పోలయ్యాయి. ఆదిత్య యూనివర్సిటీ నాన్ టీచింగ్‌కి చెందిన వ్యక్తి ఉపాధ్యాయ ఓటును నమోదు చేసుకుని ఓటును వినియోగించుకోవడంపై పోలింగ్ బూత్‌లో ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా ఓటు నమోదు అయిందని, దాని ఆధారంగానే ఓటును ఇవ్వడం జరిగిందని అధికారులు స్పష్టం చేశారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని తెలిపారు. దీనిపై యుటిఎఫ్ జిల్లా పత్రిక కన్వీనర్ పి.గిరిధర్‌గోపాలరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కానీ వారు తప్పుడు పత్రాలను నమోదు చేయించి ఓటును వినియోగించుకోవడం సబబు కాదని, దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అడిషనల్ ఎస్‌పి పర్యవేక్షించారు. **జగ్గంపేట** మండలంలో 93 శాతం పోలింగ్ అయిందని ఎపిఒ జివి.రామలక్ష్మి తెలిపారు. 43 ఓటర్లకు గానూ 40 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఎన్నికల సరళిని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు పరిశీలించారు. **శంఖవరం** మండలంలో 90 శాతం పోలింగ్ జరిగిందని ఎన్నికల అధికారి పోతురాజు తెలిపారు. మొత్తం ఓట్లు 54 కాగా, 49 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. **పెద్దాపురం** డివిజన్లో టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఆర్‌డిఒ శ్రీరమణి తెలిపారు. డివిజన్ పరిధిలో 899 మంది ఓటర్లు ఉండగా 829 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆమె తెలిపారు. పెద్దాపురంలో 156 ఓట్లకు 141 ఓట్లు పోలయ్యాయని వివరించారు. **కోటనందూరు** మండలంలో నూరు శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 23 మంది ఓటర్లు ఉండగా 23 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. **తుని** మండలంలో 261 మంది ఓటర్లు ఉండగా 231 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **తొండంగి** మండలంలో 61 మంది ఓటర్లు ఉండగా 59 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **కిర్లంపూడి** మండలంలో 53 మంది ఓటర్లు ఉండగా 50 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** మండలంలో 72 ఓటర్లు ఉండగా 69 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలో 43 మంది ఓటర్లు ఉండగా 42 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. **తాళ్లరేవు** మండలంలో 83 మంది ఓటర్లకు గాను 78 మంది ఓటు వేశారు. ఎస్‌పి. విక్రాంత్ పాటిల్ తాళ్ళరేవు పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. **కరప** మండల పరిధిలో మొత్తం 75 ఓటర్లు ఉండగా 69 ఓట్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. **గండేపల్లి** మండలంలో 32 మంది ఓటర్లు ఉంటే 28 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. అడిషనల్ ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.


పిఠాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల పరిశీలకులు హర్షవర్ధన్, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్


కోటనందూరు నుంచి బయలుదేరిన సిబ్బంది


పెద్దాపురంలో ఆర్‌డిఒ శ్రీరమణి పర్యవేక్షణ


జగ్గంపేటలో యుటిఎఫ్, సిఐటియు నాయకులు

నేరాలు ఘోరాలు

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

33 మద్యం సీసాల విక్రేత అరెస్టు చేసి, అతని బైక్ సీజ్ చేసి గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సిహెచ్.విద్యాసాగర్, ఇంచార్జ్ ఎస్.రాము తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని గుమ్మిలేరుకు చెందిన ఇసుకపాటి సోహెల్ ఎలక్షన్ కోడ్ అమలును నిర్లక్ష్యం చేస్తూ తన బుల్లెట్ బైక్‌పై 33 మద్యం సీసాలతో వస్తున్నాడు. స్థానిక సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేసే లోపల పట్టు బడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు సీఐ విద్యాసాగర్, ఇంచార్జ్ ఎస్ఐ రాము తెలిపారు.రి

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వ్యక్తి మృతిపై అతని సోదరుడు బాలయోగి చేసిన ఫిర్యాదు మేరకు ఖననం చేసిన మృతదేహానికి పోలీసులు గురువారం పోస్ట్‌మార్టం నిర్వహించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మర్లపాలెం కాశి వారి పేటకు చెందిన కాశి సత్యనారాయణ (45) గత ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతని మతదేహాన్ని సోమవారం ఖననం చేశారు. అయితే మృతుడి సోదరుడు బాలయోగి కాశి సత్యనారాయణది ఆత్మహత్య కాదని, దీనిపై దర్యాప్తు చేయాలని చేసిన ఫిర్యాదుపై సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం వైద్యులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య విజయకుమారి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్థాపం చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. పోలీసు వివరాలు ప్రకారం మండలంలోని నార్కెడిమిల్లి గ్రామానికి చెందిన ఎడ్ల నాగ ఫణీంద్ర (27) పచ్చళ్ల వ్యాపారం చేస్తూ భార్యా, బిడ్డలను పోషించుకుంటున్నాడు. ఇటీవల కాలంలో పచ్చళ్ళ వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్థాపం చెందిన అతను ఈనెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో గురువారం సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 400 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్లు పెద్దాపురం ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - పెరవలి

మల్లేశ్వరంలో పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.13,170 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పేకాట, కోడి పందేలు, బెట్టింగ్ వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

'వివాదాలు సృష్టించొద్దు'

ప్రజాశక్తి - యానాం

'నేను రాజకీయాలకు అతీతం. నేను ఎవరిపైనా ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. అనవసరం గా తనపై లేనిపోని వివాదాలు సృష్టించవద్దు' అని రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ అధినేత డాక్టర్ జిఎన్. నాయుడు గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తనను కలిసి పలు అంశాలు చర్చించామని వివరించారు. అయితే సోషల్ మీడియా, ఇతర పలు పత్రికల్లో మా మధ్య జరిగిన భేటీలో తాను చేయని వ్యాఖ్యలను చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, ఆ వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. యానాంలో వర్కర్స్ కాలనీ సిద్ధంగా ఉందని, పట్టాలు పంపిణీ మాత్రమే చేయాల్సి ఉందని, అందుకు సహకరించాలని మాత్రమే తాను ఎంఎల్ఎతో చర్చించి నట్లు వివరణ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యమన్నారు. గతంలో ఎన్నో సామాజిక సేవల ను అందించిన ఉదంతాలను ఆయన గుర్తు చేశారు.

'స్మార్ట్ స్కూల్‌గా మార్చండి'

ప్రజాశక్తి - యానాం

స్థానిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను స్మార్ట్ స్కూల్‌గా మార్పు చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును విద్యార్థులు కోరారు. స్కూల్లో టాయిలెట్స్ కొరత ఉండడంతో స్కూల్ హెచ్ఎం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థు లు మాట్లాడుతూ మిగతా హైస్కూల్స్ మాదిరిగానే తమ స్కూల్‌ను కూడా స్మార్ట్ స్కూల్‌గా మార్చాలని కోరారు. స్కూల్‌కు అవసరమైన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్మార్ట్ స్కూల్స్‌కి సంబంధించి రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం, ఎంజిజి బాయ్స్ హైస్కూల్స్ ఎస్టిమే షన్ వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం టీచర్స్ అసోసియేషన్‌కి సంబంధించి డెలికే ట్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని టీచర్ల యొక్క సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఔట్ సోర్సింగ్ స్టాఫ్ రావాల్సిన 14 నెలల బకాయిలను రప్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరారు. దీనికి సంబంధించి వినతిపత్రాన్ని అందజేయాలని సూచించారు.

బాలకృష్ణను కలిసిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

కాకినాడలో ఓ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నందమూరి బాలకృష్ణను యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

సముద్రతీరంలో ఫార్మా, బల్క్ కంపెనీలు వేస్తున్న పైపులైన్లు తక్షణమే నిలిపివేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. గురువారం పొన్నాడ పంచాయతీ పరిధిలో ఉన్న కోనపాపపేట రహ దారిపై మత్స్యకారులు బైఠాయిం చారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘ నాయకులు మాట్లాడుతూ సముద్ర తీరంలో ఫార్మా కంపెనీలు వేస్తున్న పైప్ లైన్ల ద్వారా సముద్ర జలాలు కలుషితమైతే మత్స్య సంపద అంతరించి పోతుందన్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారులుకు జీవనోపాధి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. పైపు లైన్ తొలగించలేని పక్షంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి నెలకి రూ.20 వేలు నష్ట పరిహారంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మత్స్యకార కుటుంబాల్లో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మత్స్యకార గ్రామాల్లో ఆసుపత్రులు నిర్మించి ఉచితంగా వైద్య సేవలను అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి సముద్రంలో వేస్తున్న పైప్ లైన్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మల్లిబాబు, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్-ఎస్.వర్మ మత్స్యకారులతో చర్చలు జరిపారు. ఈనెల 20వ తేదీన కలెక్టర్, అరబిందో యాజమాన్యంతో కాకినాడలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు ఆందోళనను విరమించారు.


పైపులైన్‌ను తొలగించాలని నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ప్రశాంతంగా రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికలు

ప్రజాశక్తి - సామర్లకోట

రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికలు సామర్లకోటలో ప్రశాంతంగా జరిగాయి. సామర్లకోట బ్రాంచ్ పరిధిలో సౌత్ సెంట్రల్ రైల్ మజ్దూర్ యూనియన్ (SCRMU), సౌత్ సెంట్రల్ ఎంప్లాయిస్ సంగ్ (SCRES), దక్షిణ మధ్య కార్మిక సంఘ్(DMRKS), రైల్ మజ్దూర్ యూనియన్(RMU), ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ (IRMU), తదితర సంఘాలకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 2 రోజులపాటు ఎన్నికలు గురువారంతో ప్రశాంతంగా ముగిసాయి. సామర్లకోట బ్రాంచ్ పరిధిలో సామర్లకోట, పిఠాపురం రెండు పోలింగ్ కేంద్రాలు ఉండగా సామర్లకోట పోలింగ్ కేంద్రంలో 483 ఓట్లు కాగా 430 ఓట్లు పొలయ్యాయి. పిఠాపురంలో263 ఓట్లు ఉండగా 232 ఓట్లు పోల్ అవ్వగా, మొత్తం 747 ఓట్లకు 663 ఓట్లు గురువారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి పోలేనట్లు సామర్లకోట బ్రాంచ్ సంగ్ కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు, పోలింగ్ కేంద్రం వద్ద ఆర్‌పిఎఫ్ పోలీసులు, రైల్వే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఓటు వేస్తున్న రైల్వే ఉద్యోగులు

టిటి జిల్లా జట్ల ఎంపిక పూర్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీ గురువారం స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో నిర్వహించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.మోహన్‌బాబు, అసోసియేషన్ అధ్యక్షులు, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్‌లు ప్రారంభించారు. నాలుగు విభాగాలకు సంబంధించి నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు రిఫరీలుగా టెన్నిస్ అసోసియేషన్ చీఫ్ రిఫరి పి.వేణుగోపాల్, అసిస్టెంట్ రిఫరి ఎన్.శ్రీరామ్ వ్యవహరించారు. ఈ పోటీల్లో అండర్ - 15 బాయ్స్ విభాగంలో ఎంబిఎస్.గోపీచంద్, వై.శ్రవణ్‌రాజ్, డికె.ప్రహర్ష, పి.సాయిశరవణ్, అండర్ - 15 బాలికల విభాగంలో ఎం.శాంతిజ్యోతి, ఎం.దర్శిక, టి.సాయి సుదీక్ష, నయన, మెన్స్ విభాగంలో విఖ్యాత్, విజయదర్, ఆనంద్, తనుష, మోహిత్, ఉమెన్స్ విభాగంలో ముపర్నా దాస్, శాంతిజ్యోతి, టి.సాయి సుదీక్ష, ఎం.దర్శిక, పరీష్ ఎంపికయ్యారు. ఈ టీములకు కోచ్‌లుగా పి.వేణుగోపాలరావు, నీలం.శ్రీరామ్, మేనేజర్ సింగరాజు, అరుణకుమార్ వ్యవహరిస్తారు.

కబడ్డీ పోటీలకు జట్ల ఖరారు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగునున్న 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఉభయ తూర్పుగోదావరి జిల్లాల బాలురు, బాలికల జట్లను ఖరారు చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం సామర్లకోట జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో ఎంపికైన జట్లకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ గత నెల 17వ తేదీన బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ఉభయగోదావరి జిల్లాల బాలిక, బాల క్రీడాకారులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణలు ఇచ్చినట్టు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ఈనెల ఒంగోలులో జరుగునున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు బాలికలు, బాలురు టీములు హాజరవుతారన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు కోచ్ పి వెంకట సాయి ప్రసాద్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ రెండు టీములకు క్రీడా దుస్తులు రాష్ట్ర వాణిజ్య విభాగ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ అందజేసి సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వివిఎస్ శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బడుగు శ్రీకాంత్, రిటైర్డ్ పిడితాళ్లూరి వైకుంఠం, బచ్చు ఫౌండేషన్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ బలుసు వాసు, హరిబాబు, కోటి, ప్రసాద్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్తీక మాస ఆదాయం రూ.1.34 కోట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ ఏడాది కార్తీక మాసం సందర్భంగా భీమేశ్వర ఆలయానికి ఆదాయం రూ.1,34,24,198 వచ్చినట్టు దేవాదాయ శాఖ తనిఖీ అధికారి వి.ఫణికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఆలయంలో కార్తీక మాసం హుండీల ఆదాయాన్ని ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో లెక్కించారు. లెక్కింపు అనంతరం తనిఖీ అధికారి ఫణికుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది దర్శనం టికెట్ల ద్వారా రూ.48,42,710లు, సేవా టికెట్ల ద్వారా రూ.4,74,684, అన్నదాన ట్రస్ట్‌కు రూ.30,95,379, ఆలయానికి వచ్చిన కానుకలు రూ.10,015, ప్రసాద అమ్మకాల ద్వారా రూ.15,79,070, హుండీల ద్వారా రూ.24,19,840, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన కానుకలు రూ.10,02,500 వెరసి రూ.1,34,24,198 ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

డైమండ్ గ్రూప్ స్నేహ హస్తం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాల్య స్నేహితుని డైమండ్ గ్రూప్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందించారు. 1987-88 10వ తరగతి వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న డైమండ్ గ్రూపు సభ్యుడు పులపకూర సుధాకర్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇది తెలుసుకున్న గ్రూపు సభ్యులు కాకినాడ రూరల్ ఇంద్రపాలెంలో ఉంటున్న సుధాకర్ నివాసానికి వెళ్లి రూ.50 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైమండ్ గ్రూప్ సభ్యులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, గంజా సూరిబాబు, పొన్నాడ పేరయ్యరాజు, ఉంగరాల కృష్ణ, యాళ్ల వెంకటేశ్వరరావు, బాలయోగి, గంగుల భాస్కరరావు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

ఈ నెల 7వ తేదీన మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఇఒ-2 గాడి కొండబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాల నుంచి తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో విద్యార్థులకు సంబంధించిన పూర్తి వివరాలతో తల్లిదండ్రులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

శివారు ప్రాంతాల్లో పరిశుభ్రతా పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ శివారు గుడివాడలో గురువారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణరావు ఆధ్వర్యంలో పరిశుభ్ర తా పనులు చేపట్టారు. ఈ పనులను అ వార్డు కౌన్సిలర్ ఆరేళ్ల వీర రాఘవ పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణరావు మాట్లాడుతూ పట్టణానికి గుడివాడ నివాస ప్రాంతం దూరం వల్ల పారిశుధ్య పనులు కుంటిపడ్డాయన్నారు. వార్డు కౌన్సిలర్ రాఘవ విజ్ఞప్తుల మేరకు పరిశుభ్రతా పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి రాజ బాబు, శానిటరీ సెక్రటరీ సత్తిబాబు పాల్గొన్నారు.